# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 15-11-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ విశాఖపట్నంలో నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో రెండు రోజుల్లో 13 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

- ❖ రాష్ట్రంలో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.

- ❖ పారిశ్రామిక రంగంలో నిర్మాణాత్మక సంస్కరణలు తెచ్చేందుకు సిద్ధంగా వున్నామని రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ తెలిపారు.

- ❖ సీఐఐ భాగస్వామ్య సదస్సు లో భాగంగా పర్యాటక రంగంలో 104 ఒప్పందాలు కుదుర్చుకున్నామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.

- ❖ స్వాతంత్ర సమరయోధుడు, భగవాన్ బిర్సా ముండా విగ్రహన్ని ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ రేపు అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆవిష్కరించనున్నారు.

=====================

విశాఖపట్నంలో నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో రెండు రోజుల్లో 13 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. మొత్తంగా గడిచిన 18 నెలల్లోనే 22 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చినట్లు చెప్పారు. శ్రీసిటీలో కొన్ని యూనిట్లను ముఖ్యమంత్రి విశాఖపట్నం నుండి దృశ్య మాధ్యమ విధానంలో ప్రారంభించారు. భాగస్వామ్య సదస్సులో 12 ప్రాజెక్టుల ఏర్పాటుకు వివిధ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ పెట్టుబడుల ద్వారా 12 వేల 365 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. పరిశ్రమలకు ఇచ్చే ప్రోత్సాహకాలకు ఎస్క్రో ఖాతా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే శ్రీసిటీకి 6 వేల ఎకరాల భూమిని అందుబాటులోకి తెస్తామని తెలిపారు. 1.5 లక్షల ఉద్యోగాలతో శ్రీ సిటీ `అభివృద్ధి మోడల్`గా మారుతుందని, ఎయిర్ స్ట్రిప్ నిర్మిస్తామని ముఖ్యమంత్రి ప్రకటిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

=====================

ప్రజల మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా ఎలమంచిలి మండలంలో 27 లక్షల 50 వేల రూపాయలతో జల్ జీవన్ మిషన్ పనులకు, నక్కాపాలెంలో వరద సహాయ నిధులు 28 లక్షల రూపాయలతో వంతెన నిర్మాణ పనులకు మంత్రి ఈ రోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రహదారుల నిర్మాణం చేపట్టడంతో పాటు.. జల్ జీవన్ మిషన్ నిధులతో స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

=====================

రెండు రోజుల పాటు విశాఖపట్నంలో జరిగిన 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా పర్యాటక రంగంలో 17 వేల 973 కోట్ల రూపాయల విలువైన 104 ఒప్పందాలు కుదుర్చుకున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. దీని వలన 97 వేల 876 మందికి పర్యాటక, అతిథ్య రంగాల్లో ఉపాధి లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు. విశాఖపట్నంలో మంత్రి ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... సీఐఐ భాగ్యస్వామ్య సదస్సులో చేసుకున్న దాదాపు 6 వేల 500 కోట్ల రూపాయల విలువైన ఎంవోయూలలో థీమ్ పార్కులు, మెరీనాలు, ఫిల్మ్ సిటీలు, వెల్ నెస్ సెంటర్లు, క్రూయిజ్‌లు, అడ్వెంచర్, వాటర్ స్పోర్ట్స్ వంటివి ఉన్నాయని తెలిపారు. తొలిసారిగా 1,860 కోట్ల రూపాయల విలువైన పర్యాటక విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (FDI) ఎంవోయూలపై సంతకాలు చేసినట్లు వెల్లడించారు. మీటింగ్స్, ఇన్సెంటివ్స్, కాన్ఫరెన్స్, ఎగ్జిబిషన్స్ (మైస్) క్యాపిటల్ ఆఫ్ ది సౌత్ గా విశాఖపట్టణాన్ని తీర్చిదిద్దుతామని, ఈ క్రమంలో లాజిస్టిక్ హబ్ గా విశాఖ నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు.

=====================

కృత్రిమ మేధ (ఏఐ) మానవాళికి ముప్పు కాదని, మానవత్వాన్ని తీర్చిదిద్దుతుందని రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ తెలిపారు. విశాఖలో రెండో రోజు సీఐఐ భాగస్వామ్య సదస్సులో 'ఏఐ-భవిష్యత్‌లో ఉద్యోగాల' అంశంపై చర్చ జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ... ప్రతి పారిశ్రామిక విప్లవం ఎక్కువ ఉద్యోగాలు కల్పిస్తుందన్నారు. కృత్రిమ మేధస్సును అందిపుచ్చుకోవడానికి ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా వుందని పేర్కొన్నారు. వ్యాపారవేత్తలతో పని చేసేందుకు ప్రభుత్వం ఉత్సాహంగా ఉందని, నిర్మాణాత్మక సంస్కరణలు తెచ్చేందుకు తాము సిద్ధమని లోకేశ్ పేర్కొన్నారు.

=====================

స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను రాష్ట్ర వ్యాప్తంగా అధికారులు నిర్వహించారు. బాపట్ల జిల్లాలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ర్యాలీని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ఈరోజు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర  కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నెల మూడవ శనివారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. ఈనెల వ్యక్తిగత, సమాజ పరిశుభ్రత అనే అంశంగా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు.

విరామం

=====================

జన్ జాతీయ గౌరవ్ దివస్ ను పురస్కరించుకొని, స్వాతంత్ర సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా విగ్రహ ఆవిష్కరణకు ఒడిశా రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ రేపు అల్లూరి సీతారామరాజు జిల్లాకు రానున్నారు. బిర్సా ముండా 150 వ జయంతి సందర్భంగా పాడేరు మండలం, చింతల వీధిలో బిర్సా ముండా విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్నారు. అనంతరం పాడేరు జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తారు. బిర్సా ముండా విగ్రహావిష్కరణ, బహిరంగ సభ ప్రాంతాలలో భద్రతా ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ సంబంధిత శాఖల అధికారులతో ఈ రోజు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

======================

రాజ్‌భవన్‌లో ఈ రోజు ఉత్తరాఖండ్, ఝార్ఖండ్ రాష్ట్రాల ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ... 'ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్..' కార్యక్రమం ముఖ్య ఉద్దేశం దేశంలోని పౌరులందరి మధ్య బలమైన సంబంధాన్ని, అనుబంధాన్ని పెంచడమేనని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా భిన్న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల మధ్య ఏకత్వం అనే భావన ద్వారా పరస్పర అవగాహనను పెంపొందించవచ్చని గవర్నర్ తెలిపారు.

======================

విశాఖ వేదికగా జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో రెండో రోజు రేమాండ్ గ్రూప్ ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృశ్య మాధ్యమం వేదికగా శంకుస్థాపన చేసారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ... అనంతపురం జిల్లా రాప్తాడులో 497 కోట్ల రూపాయల వ్యయంతో సిల్వర్ స్పార్క్ అపరెల్ మాన్యుఫాక్చరింగ్ పార్క్ ను ఏర్పాటు చేస్తున్నారని, గుడిపల్లిలో 441 కోట్ల రూపాయలతో ఆటో కాంపోనెంట్ మాన్యుఫాక్చరింగ్ ప్లాంట్ ను ఏర్పాటు చేయబోతున్నారని తెలిపారు. అలాగే టెకులోడు వద్ద 262 కోట్ల రూపాయలతో ఏరోస్పేస్ పరికరాల తయారీ యూనిట్ ను రేమాండ్ కంపెనీ ఏర్పాటు చేస్తోందని పేర్కొన్నారు.

======================

స్వతంత్ర సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా జయంతి వేడుకలు అల్లూరి సీతారామరాజు జిల్లా ఐటీడీఏ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి తిరుమణి శ్రీ పూజ మాట్లాడుతూ... స్వతంత్ర పోరాటంలో గిరిజనుల హక్కులు, చట్టాల కోసం జల్ జంగిల్ జమీన్ నినాదంతో బిర్సా ముండా పోరాటం చేశారని తెలిపారు. గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడే విధంగా జన్ జాతీయ గౌరవ్ దివస్ ను ప్రభుత్వం నిర్వహిస్తోందని అన్నారు.

======================

ఐరిష్ సంస్థ డి.ఎం.సి (DMC) విశాఖపట్నంలో ఆధునిక డేటా సెంటర్ల ఏర్పాటుకు సుమారు 2 వేల కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో 14 వేల కొత్త ఉద్యోగ అవకాశాలు రానున్నట్లు వెల్లడించింది. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు మీడియా కేంద్రంలో DMC చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జో వివరాలు వెల్లడించారు. భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న డిజిటల్ ఎకోసిస్టమ్‌కు విశాఖపట్నం ఒక కీలక కేంద్రంగా అవతరించనుందని జో తెలిపారు.

======================

భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య ఈడెన్‌గార్డెన్ స్టేడియం వేదికగా జరుగుతున్న తొలి టెస్టు క్రికెట్ మ్యాచ్ లో భారత్ బౌలర్లు రాణించారు. ఒక వికట్ నష్టానికి 37 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్ తో రెండవ రోజు ఆటను ప్రారంభించిన భారత్ 189 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో 30 పరుగుల ఆధిక్యం లభించింది. ఆట ముగిసే సమయానికి రెండవ ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 7 వికెట్లు నష్టపోయి 93 పరుగులు చేసింది. దీంతో 63 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

======================

దక్షిణ శ్రీలంక దానిని ఆనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతం ప్రాంతాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో, నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని అనుబంధిత ఉపరితల ఆవర్తనం రానున్న 24 గంటల్లో పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతుందని వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు వివరించారు.

======================

======================